తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-26-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 297 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపై బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



- కేసీఆర్ హయాంలో ఇండ్లు కట్టలేదన్న ఆరోపణలకు తలసాని కౌంటర్
- మంత్రులను తీసుకెళ్లి చూపించేందుకు సిద్ధమన్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరింత ముదురుతోంది. కేసీఆర్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా కట్టలేదన్న ఆరోపణలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఖండించారు.

మిగతా 2లో..

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపుపై మంత్రి స్పష్టత

- ఖాళీగా ఉన్న ఇండ్లపై సమగ్ర సమీక్ష
- లబ్ధిదారుల స్పందనలో వెలుగుచూసిన వాస్తవాలు
- అర్హులకు మళ్లీ కేటాయింపుకు కార్యాచరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

జిహెచ్ఎంసీ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపు, వినియోగంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాసనసభలో విస్తృత వివరాలు వెల్లడించారు.

మిగతా 2లో..

## తెలంగాణ అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు ఎస్ఎఫ్ఐ ఆందోళన
- కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద విద్యార్థి నేతల అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం



2లో

## ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బడ్జెట్

**భట్టి విక్రమార్క**

- యువత, రైతులు, పేదల సంక్షేమమే కేంద్రబిందువు
- ఆర్థిక క్రమశిక్షణతో సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం
- ప్రతిపక్షాలకు నిర్మాణాత్మక సహకారం కోరిన ఉప ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మార్చి 25 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ అనేది కేవలం అంకెలు, గణాంకాలు మాత్రమే కాదని, అది ప్రజల ఆశలు, ఆకాంక్షలు, భవిష్యత్తుకు బాటలు వేసే పథక పటమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి వర్గానికి న్యాయం చేయడం, సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ బడ్జెట్ లక్ష్యమని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి కలలకు వేదిక కల్పించడం ఈ బడ్జెట్ ప్రధాన ఉద్దేశమని భట్టి విక్రమార్క తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అదే విధంగా పేదలకు గృహ వసతి, ఆరోగ్య సదుపాయాలు, సామాజిక భద్రత కల్పించడంపై కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. రైతు సంక్షేమం ఈ బడ్జెట్‌లో కీలక అంశమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి మద్దతు, పంటలకు సరైన ధరల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల ఆర్థిక స్థిరత్వం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## కేసీఆర్ కిట్ నిలిపివేతపై హరీష్‌రావు తీవ్ర ప్రశ్నలు

- కొత్త పథకం ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వాన్ని నిలదీత
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు తగ్గిన అంశంపై ఆందోళన



2లో

## ఇందిరమ్మ ఇండ్లపై పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నలు

- నిధుల కేటాయింపుపై ప్రభుత్వాన్ని నిలదీత
- బడ్జెట్‌లో తక్కువ నిధులపై ఆందోళన
- వచ్చే సంవత్సరానికి నిధుల సమీకరణపై సందేహాలు



2లో



## ఆర్టీసీ సమస్యలపై సమీక్ష సమావేశం

- ప్రజాప్రతినిధులు – అధికారులతో ముఖాముఖి చర్చలు
- బస్సుల కొరత, కొత్త రూట్లపై చర్చ
- సమస్యల పరిష్కారానికి నివేదిక సిద్ధం చేయాలని నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆర్టీసీకి సంబంధించిన వివిధ అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులతో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షత వహించగా, సహచర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు మరియు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మహాలక్ష్మీ పథకం కారణంగా పెరిగిన ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అవసరమైన అదనపు బస్సులపై చర్చించారు.

మిగతా 2లో..

## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

- హైకమాండ్, సీఎం తీరుపై తీవ్ర విమర్శలు
- ఫిరాయింపుల ప్రోత్సాహంపై అసంతృప్తి వ్యక్తం
- బుజ్జగింపులు ఫలించకపోవడంతో నిర్ణయానికి కట్టుబాటు



2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపుపై మంత్రి స్పష్టత

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యమని ఆయన స్పష్టం చేశారు. భట్టి విక్రమార్కతో కలిసి పలు ప్రాంతాలకు వెళ్లినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రత్యక్షంగా చూపించామని తలసాని పేర్కొన్నారు. అవసరమైతే ప్రస్తుత కాంగ్రెస్ మంత్రులను కూడా తీసుకెళ్లి ఆ ఇండ్లను చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వాస్తవాలతోనే నిరూపిస్తామని అన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన డ్రా ద్వారా లక్ష ఇండ్ల లక్ష్యంతో ప్రణాళిక రూపొందించగా, అందులో సుమారు 68 వేల ఇండ్లు నిర్మించామని తలసాని వివరించారు. ఈ ఇండ్ల ద్వారా వేలాది పేద కుటుంబాలు లబ్ధి పొందాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గృహాల నిర్మాణాన్ని ప్రాధాన్యంగా తీసుకుని పని చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని తలసాని విమర్శించారు. గత ప్రభుత్వ పనులను తక్కువ చేసి చూపించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. వాస్తవాలు ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన సవాల్ విసిరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతుండగా, ఈ విషయంపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం మరియు ప్రతిపక్షాల మధ్య ఈ వాదోపవాదాలు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపుపై మంత్రి స్పష్టత

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం 2023 ఎన్నికలకు ముందు హడావిడిగా లాటరీ పద్ధతితో పాటు ఇతర మార్గాల ద్వారా 23,500 ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిందని తెలిపారు. అయితే వాటిలో సుమారు 12 వేల ఇండ్లలో లబ్ధిదారులు నివసించడం లేదని, ఈ పరిస్థితి ప్రభుత్వ దృష్టికి వచ్చిన వెంటనే సమగ్ర సమీక్ష చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఇండ్లను వినియోగించకపోవడానికి ప్రధాన కారణం జీవనోపాధికి దూరంగా ఉండటమేనని మంత్రి వివరించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు నగర కేంద్రానికి సమీపంగా ఉండగా, ఈ ఇండ్లు దూర ప్రాంతాల్లో ఉండటం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిజమైన పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసి లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించినట్లు చెప్పారు.

ఇచ్చిన నోటీసులకు మొత్తం 6,500 మంది స్పందించగా, అందులో దాదాపు 4 వేల మంది జీవనోపాధి సమస్యల కారణంగా ఇండ్లలోకి వెళ్లలేకపోతున్నామని స్పష్టంగా వెల్లడించినట్లు మంత్రి తెలిపారు. ఈ పరిస్థితి ప్రభుత్వానికి ఒక కీలక సంకేతమని, భవిష్యత్తులో గృహాల కేటాయింపులో ఉపాధి, జీవన సౌకర్యాల అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లబ్ధిదారులు నిర్దేశించిన గడువులోగా ఇండ్లలోకి వెళ్లకపోతే, ఆ ఇండ్లను ఖాళీగా ఉంచకుండా సమీప ప్రాంతాల్లో నివసించే అర్హులకే కేటాయించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులను గుర్తించి వారికి ఇండ్లను అందించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా గృహాలు వాస్తవంగా ఉపయోగంలోకి రావడంతో పాటు ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు.

ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఇండ్ల సమస్యను పూర్తిగా పరిష్కరించి, అర్హులందరికీ గృహాలు అందించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. అలాగే గతంలో మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు రద్దు కావడంతో ఏర్పడిన లోటును పూడ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం రూ.784 కోట్లు కేటాయించిందని తెలిపారు. అందులో ఇప్పటికే రూ.432 కోట్లు ఖర్చు చేసి రహదారులు, నీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఇంకా సుమారు రూ.200 కోట్ల మేర నిధులు అవసరమని, వాటిని కూడా త్వరలోనే కేటాయించి అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం గృహహక్కును ఒక ప్రాథమిక అవసరంగా భావించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సమర్థ విధానాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి, నీటి వనరుల వినియోగం, వ్యవసాయ మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఏర్పడిన లోపాలను సరిదిద్దడం ఈ బడ్జెట్ ముఖ్య లక్షణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ఖర్చులను సమర్థంగా నియంత్రిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. సామాన్యుడిపై పన్నుల భారం మోపకుండా వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా సమతుల అభివృద్ధి సాధించడమే లక్ష్యమని అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పేదవాడి కన్నీరు తుడిచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమగ్ర సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని సుసంపన్నమైన, సమానత్వం కలిగిన సమాజంగా తీర్చిదిద్దే దిశగా పునాది వేస్తుందని చెప్పారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క వివరించారు. అప్పులు, ఆదాయాలు, ఖర్చులను సమన్వయం చేస్తూ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధించడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. వనరుల సమర్థ వినియోగం ద్వారా ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్షాలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వాటిని నిర్మాణాత్మక సూచనలుగా మార్చి ప్రభుత్వంతో కలిసి పని చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి అనేది అన్ని పార్టీల సామూహిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే సమగ్ర ప్రణాళికగా నిలుస్తుందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. యువత, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల అవసరాలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా

**జగిత్యాల, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని జీవన్ రెడ్డి వెల్లడించారు. గౌరవం లేని చోట కొనసాగడం సాధ్యం కాకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లోపల తనకు సరైన ప్రాధాన్యత లభించలేదని, తన భావాలను పట్టించుకోలేదని ఆరోపించారు.


తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహించడం పార్టీ విధానాలకు విరుద్ధమని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పక్కన పెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇస్తున్నారని విమర్శించారు. తనకు అండగా ఉన్న కీలక నాయకుడు మరణించిన సమయంలో ముఖ్యమంత్రి పరామర్శించలేదని, తనకు మద్దతుగా నిలబడలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ కారణాల వల్లే పార్టీపై నమ్మకం కోల్పోయానని, ఇకపై రేవంత్ రెడ్డి విధానాలపైనే తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మరోవైపు, జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జీవన్ రెడ్డి తన నిర్ణయానికే కట్టుబడి ఉండగా, జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు ఉన్న బలమైన కేడర్ ఇప్పుడు ఆయన వెంట నడిచే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీ సమస్యలపై సమీక్ష సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ పనులు, బస్సుల కొరత, కొత్త బస్సులు అవసరమైన నియోజకవర్గాలపై ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామాలకు కొత్త రూట్లలో బస్సులు ప్రారంభించడం, బస్ స్టేషన్ల అభివృద్ధి వంటి అంశాలను కూడా అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించాలంటే ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.



ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అన్ని అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ద్వారా నల్గొండ జిల్లాలో ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపర్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా చర్చలు జరిగాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# తెలంగాణ అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ అసెంబ్లీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. విద్యార్థుల ఆందోళనతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కంట్రోల్ రూమ్ సిగ్నల్ వద్ద ఎస్ఎఫ్ఐ నేతలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి అదుపులో ఉండేలా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ఆలస్యం అవుతుండటంతో విద్యార్థుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆందోళనకారులు తెలిపారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు కోరుతున్నారు.

# కేసీఆర్ కిట్ నిలిపివేతపై హరీష్ రావు తీవ్ర ప్రశ్నలు

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

కేసీఆర్ కిట్ పథకాన్ని నిలిపివేసి దాని స్థానంలో కొత్త పథకం తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడంపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు నేరుగా లాభం చేకూర్చే ఈ కీలక పథకం నిలిచిపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పథకం ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టమైన గడువు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ నిలిపివేసిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు హరీష్ రావు పేర్కొన్నారు. సుమారు 20 శాతం మేర డెలివరీలు తగ్గడం ఆరోగ్య వ్యవస్థకు ప్రమాద సంకేతమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం తగ్గే పరిస్థితి ఏర్పడిందని, దీనిని తక్షణమే సరిదిద్దాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటుందో ప్రజలకు వివరించాలని హరీష్ రావు అన్నారు. డెలివరీలను తిరిగి ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మళ్లించేందుకు తీసుకుంటున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. గర్భిణీ స్త్రీలకు అందించే సౌకర్యాలు, ప్రోత్సాహకాలు తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. తాను ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో కేసీఆర్ హయాంలో మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించామని హరీష్ రావు గుర్తుచేశారు. తెలంగాణను దేశవ్యాప్తంగా మూడో స్థానంలో నిలిపామని, ఆరోగ్య రంగంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మాతా-శిశు ఆరోగ్యంపై ప్రభుత్వ దృష్టి ఎంతవరకు ఉందో ప్రశ్నిస్తూ, తీసుకుంటున్న చర్యలపై పారదర్శకత అవసరమని హరీష్ రావు అన్నారు. గర్భిణీ స్త్రీల సంక్షేమం, శిశు ఆరోగ్యం వంటి అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం అనుమతించరాదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ అంశాల్లో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ విషయంపై శాసనసభలో ప్రభుత్వం సమగ్ర సమాధానం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పాత పథకాలను పునరుద్ధరించాలని సూచించారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లపై పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నలు

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వం పై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆ లక్ష్య సాధనకు తగిన నిధులు ఎలా సమకూర్చుతుందో వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు 3,24,536 ఇండ్లు మాత్రమే మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో 2,62,468 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.12,500 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయని వివరించారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.5,000 కోట్లు మాత్రమే కేటాయించారని పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. మిగిలిన నిధులను ఎలా సమకూర్చుతారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నిధుల కొరత కారణంగా పనులు ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇవ్వాల్సిన 3,500 ఇండ్లకే సుమారు రూ.3,000 కోట్ల లోటు ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో వచ్చే సంవత్సరానికి ఇవ్వాల్సిన మరో 3,500 ఇండ్లకు నిధులు ఎలా సమకూర్చుతారో ప్రశ్నించారు. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల గృహ అవసరాలకు కీలకమని, దీనిలో ఎలాంటి లోపాలు ఉండకూడదని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకు సాగి, అవసరమైన నిధులను సమకూర్చాలని సూచించారు. ఈ అంశంపై శాసనసభలో మరింత చర్చ జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మద్దిగట్ల-మోజర్ల పాఠశాల వద్ద పరిశుభ్రతపై నిర్లక్ష్యం



**పెద్దమందడి,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్లమోజర్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పూర్తిగా కొరవడింది. పాఠశాల ఆవరణం చుట్టూ చెత్త, గడ్డి, చెట్లు పేరుకుపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పాఠశాలకు రాకపోకలు సాగించే మార్గాల్లో కూడా చెత్త, పొదలు పేరుకుపోవడం వల్ల పరిసరాలు అస్వచ్ఛంగా మారి, దోమలు అధికంగా పెరిగే ప్రమాదం నెలకొంది.చిన్నారులు రోజూ ఈ పరిస్థితుల్లోనే చదువుకోవాల్సి రావడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది.అలాగే మద్దిగట్లమోజర్ల గ్రామాల ప్రధాన కూడలి కావడంతో చెత్త తొలగింపు సక్రమంగా జరగకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోంది. స్థానికులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలతో పాటు గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టి, చెత్త తొలగింపును క్రమబద్ధీకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నూతన ఓటర్ జాబితా తయారీకి ప్రతి ఒక్కరు సహకరించాలి

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమానికి సంబంధించి వనపర్తి జిల్లాలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎస్.ఐ.ఆర్‌పై అవగాహన కల్పించారు. ఏప్రిల్ నెలలో నిర్ణయించే తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, వనపర్తి జిల్లాలో కొత్త ఓటరు జాబితా రూపొందించబడుతుందని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు నమోదు కోసం అనెక్సర్3 ఫారం తప్పనిసరిగా పూరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.అర్హత ఉన్న ప్రతి భారతీయ పౌరునికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.పొరపాట్లు లేకుండా జాబితా రూపొందించేందుకు బూత్ లెవెల్ అధికారులతో పాటు ప్రతి రాజకీయ పార్టీ నుంచి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యవసరమని వివరించారు. ప్రతి బూత్‌కు ఒక ఏజెంట్‌ను నియమించి వారి వివరాలు సమర్పిస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు.అలాగే ఓటరు అర్హతకు సంబంధించి పుట్టిన తేదీ, పుట్టిన స్థలం ఆధారాలు సమర్పించాల్సిన విధానాన్ని వివరించారు 1987కు ముందు పుట్టిన వారు తమ జనన వివరాలు సమర్పించాలి. 1987 నుంచి 2004 మధ్య పుట్టిన వారు తమతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి వివరాలు ఇవ్వాలి.2004 తర్వాత పుట్టిన వారు తల్లిదండ్రుల ఇద్దరి వివరాలు సమర్పించాలి.జనన ధృవీకరణ పత్రం, పాస్పోర్ట్, ఉద్యోగ గుర్తింపు కార్డు, బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ రికార్డులు, కుల ధృవీకరణ పత్రం తదితర 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న ఓటరు జాబితాను పూర్తిగా రద్దు చేసి కొత్తగా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా కీలకమైన అంశమని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, బీజేపీ, టిడిపి, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈనెల 30వ తేదీన అసెంబ్లీని ముట్టడిస్తాం

- **హనుమకొండ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు చిలువేరు రమేష్.**





**హసన్ పర్తి, మార్చ్ 25(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్,రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు ఈనెల 30వ తేదీన అసెంబ్లీ ముట్టడికి తీర్మానం చేశారని తెలియజేశారు. ఈసందర్భంగా హసన్ పర్తి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం రోజున విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిలువేరు రమేష్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల హక్కులకై పోరాటం చేస్తున్నామని,కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టినటువంటి హామీలు ఇప్పటివరకు అమలు చేయడం లేదని కమిటీ వేస్తానని చెప్పి మూడు సంవత్సరాలు కావస్తున్న కమిటీ వేయడం లేదు కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యమకారులు స్వచ్ఛందంగా ఈనెల 30వ తేదీన నిర్వహించబోయే అసెంబ్లీ ముట్టడిలో పాల్గొనాలని పిలుపునిచారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు భాషబోయిన రవీందర్ యాదవ్, ప్రధానకార్యదర్శి పోగుల రమేష్,పోతరాజు ప్రభాకర్, కుక్కల జ్ఞానేశ్వర్,సౌరం నాగరాజ్,కల్లిపెల్లి రాజు,కమలాపూర్ మండల అధ్యక్షుడు జేరిపోతుల రమేష్,ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు ఇనుగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పది



- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు-):** మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఇప్పళ్లపల్లి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన గీతారాణి పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నీ వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని అన్నారు.గీతారాణి సుమారు 40 సంవత్సరాల పాటు విద్యా రంగానికి విశేష సేవలు అందించారని ప్రశంసించారు.పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో పాల్గొని మరింత సేవ చేయాలని కోరారు ఈ కార్యక్రమానికి శ్రీమతి వాగ్దేవి సభాధ్యక్షత వహించగా, ఎంఈఓ కృష్ణయ్య, రాజాపూర్ ఎంఈఓ సుధాకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పాఠశాల ఛైర్మన్, లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఉపాధ్యాయులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా గట్టు రాజు



- **రెండోసారి నియామకం పై హర్షం**
- **..కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**

**పెద్దమందడి,మార్చ్25( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా గట్టు రాజును మరోసారి నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ వినయ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు నియామక పత్రాలు, ఐడి కార్డులు, డైరీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా గట్టు రాజును పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రెండోసారి నియమించగా, తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ వినయ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా గట్టు రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ చేసే విమర్శలకు సముచితంగా సమాధానం ఇస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కట్టుబడి ఉంటానన్నారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్న ఆయన, తన నియామకానికి సహకరించిన వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త కాపు శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కోమాలో విద్యార్థి.. గురువుల అండ..

- **చికిత్స కోసం సహాయం అందించిన కాకర్లపల్లి ఉపాధ్యాయులు.**



**సత్తుపల్లి, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** మానవత్వం ఇంకా నిలిచే ఉందని మరోసారి నిరూపించారు కాకర్లపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయులు. బ్రెయిన్ ఫీవర్‌తో కోమాలో చికిత్స పొందుతున్న తమ విద్యార్థి పరిస్థితి తెలిసి చలించిన గురువులు వెంటనే ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. సత్తుపల్లి మండల పరిధిలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గంప సాయి శ్రావణ్ కుమార్ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వైద్య పరీక్షల్లో అతనికి బ్రెయిన్ ఫీవర్ ఉన్నట్లు తేలడంతో ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతడు కోమాలో ఉండటం కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థి తండ్రి సతీష్ తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఖరీదైన వైద్యం చేయించేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలిసిన పాఠశాల ఉపాధ్యాయులు మానవత్వంతో స్పందించి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు వెల్లడించారు. ఉపాధ్యాయుల ఈ సేవా భావాన్ని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమా కుమారి, సుదర్శనమ్మ, రమాదేవి, థెరిస్సా, మురళీ, జహీర్ పాషా, మాధవరావు, సుజాత, భాషావలి, రమేష్, చెన్నకేశవరెడ్డి, నూర్జహాన్, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు





**పెద్దమందడి,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డి పల్లి గ్రామంలో త్రాగునీటి కొరతను తీర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలోని బోర్‌వెల్‌లో గత రెండు సంవత్సరాలుగా ఇరుక్కుపోయిన మోటార్‌ను బయటకు తీయడానికి ప్రత్యేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. మండల ఏఈ హరిప్రసాద్ మరియు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. బోర్‌లోపల రాళ్లు ఇరుక్కుపోవడం వల్ల మోటార్‌ను బయటకు తీయడం కష్టసాధ్యంగా మారింది.ఈ పనులను బోర్ స్పెషలిస్ట్ జావీద్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం జాగ్రత్తగా కొనసాగిస్తోంది. గ్రామంలో త్రాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# త్రాగునీటి వినియోగంపై గ్రామ ప్రజలకు సర్పంచ్ విజ్ఞప్తి

**పెద్దమందడి,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామంలో రాబోయే ఎండల నేపథ్యంలో త్రాగునీటి వినియోగంపై జాగ్రత్తలు పాటించాలని నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ 10, 11 వార్డులను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే రెండు నెలలు ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున మిషన్ భగీరథ నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. పైపులైన్లలో వాచర్లు తొలగించడం లేదా తోటలకు నీటిని మళ్లించడం వంటి చర్యలు చేపడితే ముందస్తు నోటీసులు ఇచ్చి గృహాలకు పవర్ కట్ చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామ ప్రజలందరూ నీటిని సమర్థంగా వినియోగించి ప్రతి ఇంటికి సరిపడా నీరు అందేలా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్



పలుస శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వార్డ్ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, సునీత శ్రీనివాస్, ఊదరి శాంతమ్మ మొగులయ్య, గ్రామ పెద్దలు పోతుల రాంరెడ్డి, ఎస్.రాములు, కావలి ఉషన్న, బోయిని కృష్ణ, ఆనంద్ రెడ్డి, బోయిని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.ఇక మిషన్ భగీరథ పైపులలో వాచర్లు లేదా చెర్రాలు తొలగించిన వారు వెంటనే సరిచేసుకోవాలని, లేనిపక్షంలో గ్రామ పంచాయతీ తరపున ఇంటింటికి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# డంపింగ్ యార్డ్‌పై హుజురాబాద్‌లో ఆగ్రహ జ్వాలలు





**హుజురాబాద్ టౌన్ మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్ష ఉద్రిక్తంగా మారింది. "ఇది చెత్త యార్డ్ కాదు...ప్రజల ఆరోగ్యంపై ముప్పు!" అంటూ నిరసనకారులు ఘాటుగా నినదించారు. వారు మాట్లాడుతూ ఈ డంపింగ్ యార్డ్ కారణంగా పట్టణానికి 15 కిలోమీటర్ల పరిధిలో రైతుల పంటభూములు కాలుష్యానికి గురవుతున్నాయని, భూమి ఉత్పాదకత తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్వాసనలు, వ్యర్థాల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న ఈ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలంటూ అధికారులకు గట్టిగా హెచ్చరించారు. సమస్యను పట్టించుకోకపోతే మరింత భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# భూకబ్జా ముఠా బట్టబయలు

- ఖాకీ అధికారి సహా 9 మంది అరెస్ట్
- నకిలీ పత్రాలతో భూముల రిజిస్ట్రేషన్లు
- కీసర పోలీసుల చాకచక్యం




**కీసర, మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** అమాయకుల భూములపై కన్నేసి నకిలీ పత్రాలతో కాజేయాలని ప్రయత్నించిన భారీ భూకబ్జా ముఠాను కీసర పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలో ఒక ఏఎస్ఐ స్థాయి పోలీసు అధికారి ఉండటం సంచలనంగా మారింది. రెండు వేర్వేరు కేసుల్లో మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన దందా ఈ నెల 16, 17 తేదీల్లో కేశబోయిన రమాదేవి, మదాను మాధురి అనే మహిళలు తమ భూములు నకిలీ పత్రాలతో ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు.నకిలీ డెత్ సర్టిఫికేట్లతో మోసం దర్యాప్తులో భాగంగా ఈ ముఠా ఖాళీగా ఉన్న ప్లాట్లు, యజమానులు అందుబాటులో లేని భూములను లక్ష్యంగా చేసుకున్నట్టు బయటపడింది. ముందుగా అసలు యజమానుల వివరాలు సేకరించి, వారు మరణించినట్లు నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించి, తరువాత నకిలీ వారసులను చూపిస్తూ గిఫ్ట్ సెటిల్‌మెంట్, సేల్ డీడ్ల ద్వారా భూములను తమ అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించేవారు.

నిందితుల వివరాలు: కనకాటి లింగయ్య గౌడ్ (ఏఎస్ఐ), ప్రవీణ్ రెడ్డి, మోడెమ్ సంపత్, కాంబ్లే దీపలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప్పల వేణు, దొనపాటి వెంకట్ రెడ్డి, గుండిగ జ్యోతి, మదాను ఇన్నయ్యలను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి నకిలీ పత్రాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ప్రజలకు హెచ్చరిక

భూముల కొనుగోలు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి డిసిపి చ. శ్రీధర్ సూచించారు. పత్రాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే లావాదేవీలు జరపాలని ఆయన తెలిపారు.పోలీసుల ప్రశంసలు కేసును త్వరితగతిన ఛేదించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందాన్ని డిసిపి అభినందించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# కన్నతల్లిని కడతేర్చిన కుమార్తె.. ఇంట్లో పాతిపెట్టి సిమెంట్‌తో పూడ్చివేత

- ప్రేమకు అడ్డొచ్చిందని దారుణ హత్య
- జవహర్‌నగర్ కేసు ఛేదించిన పోలీసులు



**జవహర్‌నగర్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజాన్ని కలవరపరిచే అమానుష ఘటన మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన ప్రేమకు అడ్డొస్తోందని కన్నతల్లినే ఓ మైనర్ కుమార్తె తన ప్రియుడితో కలిసి హత్య చేసి, ఇంట్లోనే పాతిపెట్టి సిమెంట్‌తో పూడ్చివేసిన సంఘటన తీవ్ర సంచలనం రేపుతోంది.పోలీసుల వివరాల ప్రకారం.. కౌకూర్ భరత్‌నగర్‌కు చెందిన అంజు (40) పనిమనిషిగా జీవనం సాగిస్తోంది. ఆమె చిన్న కుమార్తె (17) ఇంటర్ చదువుతున్న సమయంలో బీహార్‌కు చెందిన డ్రైవర్ మోంటీ కుమార్ సింగ్‌తో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. అయితే బాలిక మైనర్ కావడంతో ఈ సంబంధాన్ని తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో మోంటీపై గతంలో రెండు సార్లు పోక్సో కేసులు నమోదయ్యాయి.

పక్కా ప్రణాళికతో హత్య:
తల్లి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించిన నిందితులు గత ఏడాది మే 12న పథకం ప్రకారం అంజును హత్య చేశారు. ఇంట్లో దాక్కున్న మోంటీ, కుమార్తె సంకేతంతో బయటకు వచ్చి దాడి చేశాడు. కుమార్తె తల్లిని పట్టుకోగా, మోంటీ కత్తితో గుండెల్లో పొడిచి చంపాడు.

ఇంట్లోనే పూడ్చివేత:
హత్య అనంతరం మృతదేహాన్ని బెడ్ కింద దాచిపెట్టి, రక్తపు మరకలను శుభ్రం చేశారు. అనంతరం ఇంట్లోనే గుంత తవ్వి మృతదేహాన్ని పాతిపెట్టి, పైన సిమెంట్, ఇసుకతో పూడ్చివేశారు. నేల పాడైందని చెప్పి మరమ్మతులు చేయించడం ద్వారా ఎవరికీ అనుమానం రాకుండా చూశారు.

అదృశ్యం కేసుతో బయటపడిన నిజం:
అంజు కనిపించకపోవడం తో ఆమె పెద్ద కుమార్తె రోషిణి అక్టోబర్ 2025లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మోంటీని విచారించగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది.

హత్య తర్వాత పెళ్లి:హత్య అనంతరం నిందితులిద్దరూ కలిసి జీవిస్తూ, ఈ ఏడాది జనవరిలో పెళ్లి చేసుకుని ప్రస్తుతం వారికి రెండు నెలల బాబు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్ట్: మోంటీ ఒప్పుకోలుతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మోంటీ కుమార్ సింగ్ మరియు మైనర్ బాలికను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

# ఘనంగా ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు



**హనుమకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలోని చారిత్రక కట్టడం అయిన రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో కాకతీయ సామ్రాజ్య మహారాజు ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువ నాయకుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, యువతీ యువకులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, అనంతరం ప్రతాపరుద్రుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన వీరత్వం, పరాక్రమం, పరిపాలనా దక్షతను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. కాకతీయుల సువర్ణ యుగాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రతాపరుద్రుడి చరిత్ర ప్రతి తెలుగు వాడికి గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, హాజరై మాట్లాడుతూ, ఎంతో ఘనకీర్తి పొందిన ప్రతాపరుద్రుడి చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి రానున్న తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి డివిజన్‌లో ఇటువంటి ఉత్సవాలు నిర్వహించి ప్రజలకు తమ వారసత్వ సంపదపై అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు.కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించి శతాబ్దాల క్రితమే రైతులకు సాగునీరు, త్రాగునీరు అందేలా అనేక జలాశయాలు నిర్మించారని తెలిపారు. ఆధ్యాత్మికత కోసం దేవాలయాలను నిర్మించి ప్రజలు ప్రశాంతంగా జీవించే విధంగా సమాజాన్ని తీర్చిదిద్దారని అన్నారు.

వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ మాట్లాడుతూ, క్రీ.శ. 1296నుండి 1326వరకు ప్రతాపరుద్రుడు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించాడని తెలిపారు. ఆయన గొప్ప వీరుడు, పండితుడు, దయాదాక్షిణ్యాలు కలిగిన రాజుగా చరిత్రలో నిలిచాడన్నారు. ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఆధీనంలోని మాలికాపూర్ సేనపై వీరోచితంగా పోరాడి విజయం సాధించినట్లు వివరించారు. కాకతీయుల కాలంలో సాహిత్యం, వాస్తు, శిల్పకళ, సంగీతం, నృత్యం వంటి రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. వరంగల్ కోట, రామప్ప ఆలయం, వేయి స్తంభాల దేవాలయం వంటి అద్భుత నిర్మాణాలు ఆ కాలపు వైభవాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది యువతీ యువకులకు కాకతీయ చరిత్రపై అవగాహన కల్పించారు. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్ధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోటా వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, సురేందర్, రజవలి, జక్కుల రవీందర్ యాదవ్, తాడిశెట్టి విద్యాసాగర్, తోట పవన్, కుమార్ యాదవ్, టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, సోమయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం




**పెద్దమందడి, మార్చి25 ( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్‌లో బూత్ లెవెల్ ఆఫీసర్ల (బిఎల్ఓలు)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సంబంధిత బిఎల్ఓలతో పాటు బిఎల్ఓ సూపర్వైజర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఓటరు నమోదు విధానం, అవసరమైన పత్రాలు, ఫారమ్‌ల భర్తీ తదితర అంశాలపై అధికారుల ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో బిఎల్ఓలు కీలకంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితా లోపాలు లేకుండా ఖచ్చితత్వంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పాండు నాయక్, అధికారులు, బిఎల్ఓ లు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో భక్తిరసపూరితంగా ప్రసన్నాంజనేయ స్వామి పునః ప్రతిష్ఠ

- విశేషంగా నిర్వహించిన అన్నదానం.
- భారీగా తరలివచ్చిన భక్తజనం.

**సత్తుపల్లి, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్ నగర్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. బొడ్రాయి ప్రతిష్ఠ పూజ కూడా ఘనంగా నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, పార్కింగ్, క్యూలైన్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా కల్పించి కార్యక్రమాన్ని సాఫీగా నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో హనుమాన్ నగర్ ప్రాంతం మార్మోగింది. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడగా, ఈ మహోత్సవం సత్తుపల్లి పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను, చల్లగుళ్ల నరసింహారావు తదితరులు హాజరయ్యారు.





# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి,మాజీ డీసీసీబీ డైరెక్టర్ గుండ్రెడ్డి

**చిల్పూర్,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** వంగాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు కొంగ రాజు తండ్రి కొంగ గణేష్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేష్, మాజీ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పిన వారు కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం కొంగ గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు కేసిరెడ్డి రాకేష్ రెడ్డి, నియోజకవర్గ యువ విభాగం ప్రధాన కార్యదర్శి అనంతపురం కమలేష్, మాజీ సర్పంచులు మునిగాల యాకుబ్, కలకోటి అనిల్, వార్డ్ సభ్యులు మట్టపల్లి వెంకటేశ్వర్లు, పాశం సంజీవ, కలకోల్ యాదగిరి, నిఖిల్ పాల్గొన్నారు.




# రేపు రాష్ట్రవ్యాప్తంగా కాలేజీలు బంద్

- PDSU విద్యార్థుల ఆందోళన

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీలను బంద్ చేయాలని విద్యార్థుల సంఘం PDSU పిలుపునిచ్చింది. వారు ప్రభుత్వంపై ప్రగాఢ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పేర్కొన్నారని, బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికేట్లు కూడా ఇవ్వడం లేదని వాళ్ళు అందుకే చదువులో ప్రగతికి పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని హెచ్చరించారు. అలాగే, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20% వేతనం విద్య కోసం కేటాయించాలని PDSU కోరింది. విద్యార్థుల ఆందోళనతో రేపటి బంద్ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా కనిపించవచ్చని తెలుస్తోంది.

# కుషాయిగూడలో బాలుడి అనుమానాస్పద మృతి

- పాఠశాలలో కుప్పకూలిన విద్యార్థి... చికిత్స పొందుతూ మృతి
- తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



**కుషాయిగూడ, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడి మృతి సంచలనంగా మారింది. ఆదర్శ్ నగర్, కాప్రాకు చెందిన బ్రహ్మందం డి జ్యోతి తన కుమారుడు సూరజ్ కుమార్ (14) మృతి పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, సూరజ్ కుమార్ వాసవి శివనగర్‌లోని గోపీ మెమోరియల్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మార్చి 6 ఉదయం పాఠశాల ప్రాంగణంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోవడంతో పాఠశాల యాజమాన్యం వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు బాలుడిని మొదట కొరల్ ఆసుపత్రికి తరలించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం మెడికోవర్ ఆసుపత్రికి మార్చారు. అక్కడే అదే రోజు రాత్రి మెదడుకు శస్త్రచికిత్స నిర్వహించారు. తరువాతి రోజు గాంధీ ఆసుపత్రికి తరలించగా, మార్చి 8 తెల్లవారుజామున బాలుడు మృతి చెందాడు. అనంతరం కుషాయిగూడలో అంత్యక్రియలు నిర్వహించారు.వైద్యుల ప్రకారం, మెదడులో రక్తం గడ్డకట్టడం వల్లే మృతి సంభవించినట్లు తెలిపారు. అయితే, ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేసిన తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు మార్చి 25 బుధవారం రోజు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





## ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో సీతారాముల కళ్యాణం

◆ 19 విగ్రహాల ప్రతిష్టాపనతో ఆలయానికి కొత్త కళ

**భీమదేవరపల్లి, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రసిద్ధ కాకతీయుల కాలం నాటి ముత్తారం త్రికూటేశ్వర ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీలలో 19 నూతన విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్టాపనతో ఆలయానికి కొత్త కళ వచ్చిందని గ్రామ ప్రజలు తెలిపారు. నూతన విగ్రహాల ప్రతిష్టాపన అనంతరం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీఎస్ భక్త బృందం వెల్లడించింది. ఆలయ ప్రాంగణంలో గ్రామ పురోభివృద్ధి దృష్ట్యా భక్త బృందం, గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతారాముల కళ్యాణం అనంతరం దాతల సహకారంతో మహా అన్నప్రసాద వితరణ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీఎస్ భక్త బృందం కోరింది.



## జమ్మికుంట ప్రీమియం లీగ్ ఘన ఆరంభం

– యువతకు చైర్మన్ ప్రేరణ



జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్ (జెపిఎల్ )ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పరిచయం చేసుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంచుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని సూచించారు. అలాగే తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండాలని హితవు పలికారు. ఇలాంటి టోర్నమెంట్లు స్థానిక ప్రతిభను వెలికితీయడానికి ఎంతో దోహదపడతాయని, అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీ పడాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు దిడ్డి కోమల, దిడ్డి రాము, మాచెర్ల రాజు, కందాల రాము, శ్రీనివాస్, రాము తదితరులు, క్రీడాభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణిని కలిసిన ఆచార్య ఆత్మీయ బృందం

_వేద ఆశీర్వచనాలతో సన్మానం
– పలువురు ప్రముఖుల హాజరు

**జవహర్ నగర్, మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ కు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చక్రపాణిని, కాప్రాకు చెందిన ఆచార్య ఆత్మీయ మిత్ర బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనను వేద బ్రాహ్మణులు శ్రీ విజయ దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సాయి కిరణ్ శర్మ వేద ఆశీర్వచన మంత్రాలతో సన్మానించారు.పోలీసు సేవలో ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను కాపాడే దిశగా కృషి చేస్తానని ఏసీపీ చక్రపాణి తెలిపారు. సమాజ సేవలో భాగంగా పోలీసులు, ప్రజలు పరస్పరం సహకరించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షులు, ఆలయ కమిటీ చీఫ్ అడ్వైజర్ మరియు ఆచార్య ఆత్మీయ మిత్రబృందం వ్యవస్థాపకులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి, నూతన గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి విజయ్ గౌడ్, ఎన్నారై గన్నోజు ప్రభాకర్, జై జవాన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ఎస్.ఎం. సాహెబ్, ఆలయ కమిటీ అధ్యక్షులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నినాదాలతో మార్మోగిన జమ్మికుంట తహశీల్దార్ కార్యాలయం

**జమ్మికుంట టౌన్, మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షనర్స్ వాలిడేషన్ చట్టానికి వ్యతిరేకంగా జమ్మికుంటలో పెన్షనర్లు బుధవారం ఉగ్రరూపంలో ఆందోళన చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ గళమెత్తారు.

"చట్టం రద్దు చేయాలి", "పెన్షనర్లకు న్యాయం చేయాలి" వంటి నినాదాలతో కార్యాలయం పరిసరాలు మార్మోగాయి. నిరసనలో పాల్గొన్న పెన్షనర్లు మాట్లాడుతూ, ఈ చట్టం అమలులోకి వస్తే తమ ఆర్థిక భద్రతకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పెన్షన్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే ఈ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఖర్చుల మధ్య ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి విఠల్ రావు మాట్లాడుతూ, పెన్షనర్ల హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించి తమ డిమాండ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పెన్షనర్లు, వివిధ సంఘాల నాయకులు, మాజీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి పరిస్థితిని అదుపులో ఉంచారు.

## ఆల్ ఇండియా బంజారా సేవా సంగం రాష్ట్ర కార్యదర్శిగా డుంగ్రోత్ కిషోర్ నాయక్

◆ రవీంద్ర భారతిలో జరిగిన జాతీయ సదస్సులో నియామకపత్రం అందజేత

**హన్మకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):**




హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర స్థాయి సదస్సు ఘనంగా నిర్వహించబడింది. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డుంగ్రోత్ కిషోర్ నాయక్ రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందుకుని ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా డుంగ్రోత్ కిషోర్ నాయక్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ బంజారా సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాజానికి సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బంజారా భీష్మగా పేరొందిన అమర్ సింగ్ తిలావత్, జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ అజ్మీర ప్రొఫెసర్ సీతారాం నాయక్, జాతీయ సలహా కమిటీ చైర్మన్ రఘు నాయక్ రుదావత్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ బంజారా గాంధీగా ప్రసిద్ధి చెందిన రవీందర్ నాయక్, మాజీ ఎంపీ, మాజీ చైర్మన్ రామచందర్ నాయక్, జాతీయ నాయకుడు జే లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ సంఘాల నాయకులు, ఓయూ విద్యార్థి నాయకులు కూడా హాజరయ్యారు.

## ప్రజల ఇబ్బందులకు ప్రత్యక్ష సాక్షి అయిన చైర్మన్

**జమ్మికుంట టౌన్, మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):**





వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరుతున్న పరిస్థితులతో హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, సమస్య తీవ్రతను అర్థం చేసుకునేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా రంగంలోకి దిగారు. అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలోకి దిగి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడం విశేషం.

శ్రీరామ హాస్పిటల్ నుంచి అంబేద్కర్ కాలనీ వరకు డ్రైనేజీ మార్గాన్ని తనిఖీ చేసిన చైర్మన్, అక్కడి దుస్థితిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మురికినీరు రెండు వైపుల నుంచి చేరడం, అలాగే ప్రజలు నిర్లక్ష్యంగా పారబోసిన ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, సంచులు భారీగా పేరుకుపోవడం వల్ల డ్రైనేజీ పూర్తిగా మూసుకుపోయినట్లు గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ దెబ్బతిన్న పరిస్థితి కూడా వెలుగులోకి వచ్చింది.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, "డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటుంది. అయితే ప్రజలు కూడా చెత్తను డ్రైన్లలో వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి" అని సూచించారు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి డ్రైనేజీ శుభ్రపరిచే పనులను వేగవంతం చేస్తామని, రాబోయే వర్షాకాలానికి ముందే సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చైర్మన్ స్వయంగా డ్రైనేజీలోకి దిగి పరిశీలించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. "ఇలాంటి నాయకత్వం ఉంటే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి" అంటూ కాలనీవాసులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్, వడ్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు ఘన సన్మానం


**కుషాయిగూడ, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**




ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ యూనియన్ అధ్యక్షుడు జి. లక్ష్మణ్ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసీఐఎల్ ప్రాంగణంలోని ఈసీఓఏ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఈసీఐఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ ప్రోతిక్ కుమార్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన సేవాకాలాన్ని పూర్తి చేసి పదవీ విరమణ పొందడం సహజమని, ఉద్యోగ జీవితంలో నిబద్ధత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. జి. లక్ష్మణ్ యూనియన్ అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, బిఎంఎస్ కార్మిక నాయకులు మాట్లాడుతూ లక్ష్మణ్ నాయకత్వంలో యూనియన్ బలోపేతం అయిందని తెలిపారు. ఆయన శేషజీవితం ఆనందంగా, ఆరోగ్యంగా కొనసాగాలని ఆకాంక్షించారు.అనంతరం లక్ష్మణ్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్‌సీఎంసీ సభ్యులు, అధికారులు, కార్మికులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఆఫీస్ బేరర్స్, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేలేరు మండల బీఆరెస్ కన్వీనర్‌గా కొయ్యడ మహేందర్ నియామకం

**వేలేరు, మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు ):**



వేలేరు మండలంలో బీఆరెస్ పార్టీ మండల కన్వీనర్‌గా పీచర గ్రామానికి చెందిన కొయ్యడ మహేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య బుధవారం మహేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ, మండలంలో పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకొని పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మరియు పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## డబుల్ బెడ్ రూమ్ వాణిజ్య సముదాయాల అమ్మకాలు ఆపాలి సీఐటీయూ

**నాచారం, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**



డబుల్ బెడ్ రూమ్ కాలనీలలో నిర్మించిన వాణిజ్య సముదాయాలను వేలం ద్వారా విక్రయించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ నాచారం కార్యదర్శి పి. గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బుధవారం తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలలోని వాణిజ్య సముదాయాలను అమ్మకానికి పెట్టడం వల్ల లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, కాలనీలలో అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చైతన్య నగర్, చర్లపల్లి, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల సాధన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సుభాష్ నగర్‌లో సమస్యలపై నెమలి అనిల్ కుమార్ పర్యటన

- రోడ్ల దుస్థితిపై అధికారులకు సూచనలు
- త్వరితగతిన పరిష్కారానికి హామీ

**ఉప్పల్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రముఖ నాయకుడు నెమలి అనిల్ కుమార్ శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు .ఈ సందర్భంగా నాచారం సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రమేష్ కుమార్‌తో కలిసి ప్రాంతంలోని రోడ్ల దుస్థితిని పరిశీలించారు. దెబ్బతిన్న రహదారుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పేర్కొన్న నెమలి అనిల్ కుమార్, సుభాష్‌నగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు త్వరలోనే తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, కోయలకొండ రాజేష్, అన్వర్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.



# హనుమకొండలో గిరిజన సంఘ నాయకుల ముందస్తు అరెస్టులు



**హనుమకొండ,మార్చి 25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాలు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, గిరిజన శక్తి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు డా. గుగులోతు రాజు నాయక్, ఉపాధ్యక్షుడు వాంకుడోత్ అశోక్ నాయక్‌లను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేశారు. అలాగే సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు కునుసోతు మురళి నాయక్‌ను హనుమకొండ సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.గిరిజన వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నదని, పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయడం, బ్యాక్లాగ్ ఎస్టీ పోస్టులను భర్తీ చేయడం వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గిరిజన డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరుతున్నారు.అర్ధరాత్రి అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణిచివేయలేరని గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకుంటూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ధర్మారంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆక్రమణ



- ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం

**జమ్మికుంట టౌన్ మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మండలం ధర్మారం గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులు ఆక్రమించడం పాలనలో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోంది. ఏడు సంవత్సరాలుగా నిర్మాణం పూర్తి అయిన ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించకుండా ఖాళీగా ఉంచడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

ఇల్లు లేక కిరాయి భారం భరించలేని పరిస్థితుల్లో గ్రామస్తులు ఖాళీగా ఉన్న ఇండ్లను శుభ్రం చేసుకుని నివాసం ఏర్పరచుకోవడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది. "ప్రభుత్వానికి మా గోడు తెలియజేయడానికే ఈ చర్య" అని వారు చెబుతున్నప్పటికీ, ఇది అధికారుల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

నిర్మించిన ఇండ్లను పంపిణీ చేయకుండా వదిలేసి, కొత్త పథకాల పేరుతో ప్రకటనలు చేయడం ఎంత వరకు సమంజసం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థలం లేని నిరుపేదలకు న్యాయం జరగకుండా, పథకాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శిస్తున్నారు.

ఇండ్లు ఖాళీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన గ్రామస్తులు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన పాలనలో ఉన్న లోపాలు, ఆలస్యాలపై గట్టి ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# సిపిఐ పార్టీ గ్రామ శాఖ సమావేశంలో జమ్ముల



**ఖమ్మం బ్యూరో, మార్చి 25(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో అధ్యక్షువర్గం రాణి ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి హాజరై ప్రసంగించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గం సభ్యులు పావులూరి మల్లికార్జునరావు సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు గ్రామ సర్పంచ్ పర్స రామచంద్రరావు మండల నాయకులు తుపాకల సైదులు బేబిరాణి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి లక్ష్మీనారాయణ గ్రామ నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు

# పాలకుల వివక్ష కు వ్యతిరేకంగా...

- కదంతొక్కిన కలం కార్మికులు
- ఐఅండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడి
- విజయవంతంగా ఛలో.. హైదరాబాద్
- టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపకుడు మామిడి సోమయ్య
- టీ డ బ్ల్యూ జే ఎఫ్ హెచ్ -2843 జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ*
- కోశాధికారి అరవేపల్లి నగేష్

**ఖమ్మం బ్యూరో,మార్చి 25(తెలంగాణ ముచ్చట్లు)**






ఖమ్మం :జిల్లా కేంద్రం నుండి చలోహైదరాబాద్ జర్నలిస్టుల పై వివక్షతను విడనాడాలని ఐ & పి ఆర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా యూనియన్ సభ్యులు జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా అనేక మంది జర్నలిస్టులు బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐఅఃడ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్"కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్ జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య మరియు రామకృష్ణ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య రామకృష్ణ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో 33 జిల్లాల్లో ఉన్న అధ్యక్ష కార్యదర్శులు జర్నలిస్టులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. వారిలో కొంతమంది మాట్లాడుతూ జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సభ్యులు, నగర సభ్యులు వేముల కొండ రమేష్ , మామిడాల వీరబాబు వి ఆర్ ఎం వెంకటే కప్పల మధు గోపాలకృష్ణ ,కిరణ్ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు.



# మల్కాజిగిరి కమిషనర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఉప్పల్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కేశపాగ రామచందర్, ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకుడు మనోహర్, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ, రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి మాదిగ, జర్నలిస్టు సంఘ నాయకుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో షెడ్యూల్డ్ కులాలు మరియు అనగారిన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కూడా నాయకుల సూచనలను గమనించి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం

- హుజురాబాద్ న్యాయవాదుల హర్షం

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర మంత్రివర్గం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు ఆమోదం తెలపడంపై హుజురాబాద్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ జీడీ రవితేజ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు న్యాయవాదుల భద్రతకు కీలకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు.



# చర్లపల్లి డివిజన్ ఐజీ కాలనీ సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావన

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాలనలో నిర్మించిన ఇందిరా గృహకల్ప కాలనీ ప్రస్తుతం తీవ్ర సమస్యలతో సతమతమవుతోందని ఆయన పేర్కొన్నారు. కాలనీలో ఇళ్ల పైకప్పులు లీక్ అవడం, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం, స్లాబ్‌లు పగుళ్లు రావడం వంటి సమస్యలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయని తెలిపారు. ఈ అంశాలపై జీహెచ్ఎంసీ, ఆర్&బీ, వాటర్ వర్క్స్ శాఖలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.సుమారు 5,000 మంది నివాసితులు ఈ సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మత్తులు చేపట్టి కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కాలనీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# దమ్మపేటలో రోడ్డు ప్రమాదం

◆ వృద్ధుడికి స్వల్ప గాయాలు.

**దమ్మపేట, మార్చి 25(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని గాంధీనగర్ గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధుడు స్వల్పంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఆళ్ళ నాగేశ్వరరావు (60) పనుల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ రహదారి దాటుతుండగా, అశ్వారావు పేట వైపు నుంచి సత్తుపల్లి దిశగా వెళ్తున్న కారు అతనిని ఢీకొట్టింది. అనంతరం ఆ వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వైద్య సిబ్బంది నాగేశ్వరరావుకు ప్రథమ చికిత్స అందించి, అనంతరం దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు



స్వల్ప గాయాలే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రహదారుల పై వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



# కూషాయిగూడ కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభం

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూషాయిగూడలోని కోర్టు ప్రాంగణంలో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్‌ను బుధవారం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి. బాల భాస్కర్ రావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి మాట్లాడుతూ కోర్టు పరిధిలో ప్రభుత్వ తరపున వాదనలు వినిపించే న్యాయవాదులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ ఛాంబర్ ఉపయోగపడుతుందని తెలిపారు. గవర్నమెంట్ ప్లీడర్ కె. రాంచందర్ రెడ్డిని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి అమరావతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి. కిరణ్ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, మూడవ జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఏజీపీ సునితా రాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ డీసీపీకి మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

**ఉప్పల్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొల్లు సురేష్ కుమార్‌ను పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చురుకుగా పనిచేస్తున్నారని, ఇటీవల జరిగిన కేసుల పరిష్కారాలతో స్పష్టమవుతోందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి సంబంధించిన జ్ఞాపికను డీసీపీకి అందజేసి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పి.పి. నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కనకమెడల రాంబాబు, పి. నాగేశ్వరరావు, ఉప్పల సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల సహకారంతో మరింత మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

# నాన్‌వెజ్ ప్రియులకు షాక్.. ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు బంద్!

**హైదరాబాద్, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో నాన్‌వెజ్ ప్రియులకు షాక్ ఇచ్చే పరిణామం చోటుచేసుకుంది. చికెన్ వ్యాపారులు భారీ నిర్ణయం తీసుకున్నారు. లాభాలు తగ్గిపోవడంతో ఏప్రిల్ 1 నుంచి హైదరాబాద్‌లో చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పలు చోట్ల ఈ విషయంపై పోస్టర్లు కనిపిస్తూ, పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు సరైన లాభ మార్జిన్లు ఇవ్వడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఖర్చులు, తగ్గుతున్న ఆదాయం కారణంగా షాపులు నడపడం కష్టంగా మారిందని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ చికెన్ షాప్ యజమానుల సంఘం బంద్‌కు పిలుపునిస్తూ, లాభ మార్జిన్లు పెంచే వరకు ఈ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీంతో నగరంలో చికెన్ సరఫరాపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే గుడ్ల మార్కెట్‌లో మరో ఆసక్తికర పరిణామం కనిపిస్తోంది. ఇటీవలి రోజుల్లో గుడ్ల ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో పశ్చిమ ఆసియా దేశాలకు ఎగుమతులు దెబ్బతినడంతో, స్థానిక మార్కెట్‌లో సరఫరా పెరిగింది. దీంతో ధరలు ఒక్కసారిగా క్షీణించాయి.

ఒకవైపు చికెన్ షాపుల బంద్, మరోవైపు గుడ్ల ధరల పతనం—ఈ రెండు పరిణామాలు పౌల్ట్రీ రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. వ్యాపారుల డిమాండ్లపై ప్రభుత్వం, సంబంధిత కంపెనీలు ఎలా స్పందిస్తాయన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే వినియోగదారులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు...

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, మార్చి -25(తెలంగాణ ముచ్చట్లు)**

రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం నిర్వహించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 128వ మహాజన సభ సమావేశంలో పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ* సహకార సంఘం ద్వారా అందించే వివిధ రకాల రుణాలను వినియోగిస్తూ రైతులు ఎలా ఆర్థికంగా మంచి స్థితికి చేరుకోవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించడం కీలకమని తెలిపారు. సాగు యాంత్రీకరణకు రుణాల పంపిణీ పెంచాలని, దీనివల్ల అధిక సంఖ్యలో పంట పండి రైతులకు లాభం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు.

రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం, చేపల పెంపకం వంటి వివిధ వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా ఆదాయం సంపాదించుకోవడంపై సహకార సంఘాలు ప్రోత్సహించాలని అన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులకు సంబంధించి వివరాల నమోదులో పొరపాట్లు జరగడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. సహకార సంఘాలలో రైతుల వివరాలు నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల వివరాల నమోదులో జరిగిన పొరపాట్లను 15 రోజులలో సవరించాలని లేని పక్షంలో చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు మంజూరు చేసిన రుణాల రికవరీ



పై వ్యవసాయ సహకార సంఘాలు దృష్టి సారించాలని, రైతులు స్వచ్ఛందంగా రుణాల చెల్లింపులు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. రైతులు బలోపేతం కావడం వల్ల మన సహకార సంఘాలు బలోపేతం అవుతాయని, లాభసాటిగా వ్యవసాయం మారుతుందని అన్నారు. అంతకుముందు కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డిసెంబర్, 2025క్వార్టర్ అంతానికి సాధించిన ప్రగతి, వివిధ అంశాలలో బ్యాంక్ పురోగతి పై అధికారులతో సమీక్షించారు. పిఏసిఎస్ ల బలోపేతం, రైతుల సంక్షేమం దిశగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం ఎల్. సుజిత్ కుమార్, టీఎస్ సిఏబి డిజిఎం కె. రవికాంత్ రెడ్డి, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, ఖమ్మం డిసిసిబి సిఇఓ వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం డిసిసిబి సిఇఓ శ్రీనివాస్, పిఏసీఎస్ అధ్యక్షులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు






# అభిరుచులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోండి

◆ కలెక్టర్ మను చౌదరి


**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా తమ అభిరుచులకు అనుగుణంగా అంశాలను ఎంపిక చేసుకుని వాటిలో నైపుణ్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. తమ ప్రతిభను వెబ్‌సైట్ల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసుకునేలా అభివృద్ధి చెందాలని,పిలుపునిచ్చారు.బుధవారం కీసర మండలం నాగారంలోని మేడ్చల్ తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలికలు) స్కూల్ మరియు జూనియర్ కాలేజీని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం సమయానికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. వసతి గృహంలో బోధన పరిస్థితులపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు క్రీడలు, గేమ్స్ మరియు ఇతర అభిరుచులలో కూడా ప్రతిభ కనబరచాలని తెలిపారు. ఇందుకు అవసరమైన శిక్షణను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, బిడియాన్ని వదిలి తమకు తెలిసిన విషయాలను నలుగురిలో చెప్పగలగాలని సూచించారు. మారుతున్న టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్ వర్క్ చేయడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవాలని చెప్పారు.ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటీ వంటి ఏఐ టూల్స్ వినియోగం పెరుగుతోందని, వీటి ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి రంగాల్లో అవకాశాలు విస్తరించాయని తెలిపారు.మంచి అలవాట్లు అలవరచుకోవాలని, సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సబ్జెక్ట్ అంటే కేవలం అకాడమిక్స్ మాత్రమే కాకుండా ప్రపంచ పరిణామాలపై అవగాహన ఉండాలని చెప్పారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం ద్వారా స్టేజ్ ఫియర్‌ను అధిగమించవచ్చన్నారు. విద్యార్థినులతో భోజనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఫుట్‌బాల్, చెస్ వంటి ఆట వస్తువులు కావాలని కోరగా, అవసరమైనవి అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని స్కూల్ ప్రిన్సిపల్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి కాంతమ్మ, కీసర ఎంఆర్ఓ యాదగిరి రెడ్డి, ప్రిన్సిపల్ స్వప్న, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా చరణ అరుణ్ ల నిశ్చితార్థపు వేడుక

**-హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు**

**హనుమకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ వికాస్ నగర్ లో అజ్మీర కళ్యాణి పెద్దన్న కుమార్ (సిఐ) కుమార్తె చరణ పార్వతి, శరత్ ఆదావత్ (రిటైర్డ్ ఐఎఎస్) కుమారుడి నిశ్చితార్థం వేడుక బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ నిశ్చితార్థానికి మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర శారద సీతారాం నాయక్ దంపతులు, అజ్మీర ప్రమీల శ్రీరాం నాయక్ దంపతులు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీ ఎన్ నాయక్, వాంకుడోత్ వీరన్న నాయక్, లాల్,ఏ ఆర్ నాయక్, వీరమ్మ గోపి సింగ్,





లావుడియా పల్లవి రాజు నాయక్, మూడు రమేష్, భూక్య శ్రవణ్ కుమార్, రామ్ కుమార్, పోరిక ఈశ్వర్ సింగ్, వెంకన్న, కిరణ్ కుమార్, రఘుపతి,అనుసూర్య జగ్ మాల్,భానోత్ ఈర్య, భీమా నాయక్, సుధాకర్, రమాదేవి, సునీత, వసంత చీమన్ నాయక్, అరవింద్, సర్పంచ్ గణేష్, ప్రొఫెసర్ బాబులాల్, సములాల్ ప్రొఫెసర్, మోహన్ లాల్, రవినాథ్,పోలీస్ డిపార్ట్మెంట్ ఎస్పి, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు,వివిధ పార్టీ నాయకులు, కుల సంఘాల నాయకులు, వివిధ శాఖకు చెందిన పలువురు నిశ్చితార్థం వేడుకలో పాల్గొని కాబోయే నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

# ఐబిసి సవరణ బిల్లుపై లోక్‌సభలో గళమెత్తిన ఎంపి కడియం కావ్య

**-ప్రజల డబ్బు రక్షణపై ప్రశ్నలు**

**వరంగల్,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** ఐబిసి కోడ్ (సవరణ) బిల్లు-2025పై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో తీవ్రంగా స్పందించారు. ఈ బిల్లు ప్రజల ప్రయోజనాలను కాపాడేలా లేదని, కేవలం ప్రక్రియలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. 2016లో ప్రవేశపెట్టిన చట్టం కంపెనీలకు క్రమశిక్షణ తీసుకురావడం, బ్యాంకుల డబ్బును రక్షించడం లక్ష్యంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆలస్యాలు పెరగడం, భారీగా రాయితీలు ఇవ్వడం, ప్రమోటర్లు బాధ్యత నుంచి తప్పించుకోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.బిల్లులో క్లాజ్ 4 ప్రకారం 14 రోజుల గడువు నిర్దేశించినప్పటికీ, ఎన్‌సీఎల్టీ, ఎన్‌సీఎల్ఏటీ సంస్థల్లో ఖాళీలు, పెండింగ్ కేసులు ఉన్న నేపథ్యంలో అది ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. సామర్థ్యం లేకుండా గడువులు నిర్ణయించడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.

మోసాల నిర్వచనాలను చేర్చడం మాత్రమే సరిపోదని, వాటిపై కఠిన చర్యలు తీసుకునే వ్యవస్థ స్పష్టంగా కనిపించడం లేదని తెలిపారు. కంపెనీలను నష్టపరిచిన వారు బయటపడుతుండగా, బ్యాంకులు నష్టపోతున్నాయని, చివరకు ప్రజల డబ్బే నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. క్లాజ్ 42లో కీలక అంశాలను చట్టంలో పొందుపరచకుండా నోటిఫికేషన్లకు వదిలేయడం పార్లమెంట్ పాత్రను తగ్గించడం అవుతుందని విమర్శించారు. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ అధికారాలను పెంచడం వల్ల ప్రజా ప్రయోజనాల కంటే ఒప్పందాలకు ప్రాధాన్యం పెరిగే ప్రమాదం ఉందన్నారు. రిజల్యూషన్ ప్రణాళిక అమలులోకి వచ్చిన తర్వాత కార్మికుల బకాయిలు, చిన్న రుణదాతల హక్కులపై స్పష్టత లేదని పేర్కొన్నారు.వేగం కోసం న్యాయాన్ని త్యాగం చేయకూడదని స్పష్టం చేసిన ఎంపీ, ఒక కంపెనీ డిఫాల్ట్ అనేది కేవలం లెక్కల్లో విషయం కాకుండా ప్రజల పొదుపులు, రైతుల డబ్బుతో సంబంధం ఉన్న అంశమని అన్నారు. ఈ బిల్లు సమస్యలకు పరిష్కారం చూపడం లేదని, కాబట్టి దీనిని తిరిగి పరిశీలనకు పంపాలని లోక్‌సభను కోరారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఉందా లేక పెద్ద డిఫాల్టర్ల పక్షాన ఉందా అన్నది స్పష్టంచేయాలని పేర్కొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## వరంగల్‌లో వాతావరణ సదుపాయాల లోటుపై లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపి కావ్య

- ప్రత్యేక వ్యవస్థకు ఎంపీ కడియం కావ్య డిమాండ్



**వరంగల్,మార్చి 25(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో ఆధునిక వాతావరణ పర్యవేక్షణ మౌలిక సదుపాయాల్లో ఉన్న లోటుపాట్లను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో తీవ్ర వాతావరణ మార్పులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో తగిన స్థాయి సదుపాయాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.ఈ అంశంపై స్పందించిన భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఐదు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, వర్షపాతం కొలిచే పరికరాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే వరంగల్‌లో డాప్లర్ వాతావరణ రాడార్ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్న రాడార్ల ద్వారా వరంగల్ ప్రాంతానికి సేవలు అందుతున్నాయని చెప్పారు. అలాగే జిల్లాలో ప్రత్యేక వరద హెచ్చరిక కేంద్రం లేకపోయినా, సమీప ప్రాంతాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

దీనిపై ఎంపీ కడియం కావ్య స్పందిస్తూ, ఇతర ప్రాంతాలపై ఆధారపడటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనలో లోపాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలోనే ఖచ్చితమైన వాతావరణ అంచనాలు, మెరుపు హెచ్చరిక వ్యవస్థలు, వాతావరణ ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేయాలని కేంద్రాన్ని కోరారు.ప్రస్తుత అలర్ట్ వ్యవస్థలు, మిషన్ మౌసమ్ వంటి కార్యక్రమాలు ఉన్నప్పటికీ, వరంగల్ వంటి సున్నిత ప్రాంతాల కోసం ప్రత్యేక పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ముందస్తు చర్యలు, సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



## ఏప్రిల్ 7 చలో ముంబై జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

- బండారి సురేందర్ మాదిగ పిలుపు

**హనుమకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎంఎస్పీ-ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఏప్రిల్ 7న నిర్వహించనున్న చలో ముంబై జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని తీర్పు ఇచ్చినా, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు జరగడం లేదని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలు జరుగుతుండగా, మిగతా రాష్ట్రాల్లో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముంబైలో జరిగే జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎండీ శంషుద్దీన్, విహెచ్పీఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుక రాజు మాదిగ, మండల ఉపాధ్యక్షులు సింగారపు పవన్ మాదిగ, పుట్ట ప్రణయ్ మాదిగ, పుట్ట ప్రభాకర్ మాదిగ, బొడ్డు దీపక్ మాదిగ, మల్లెపల్లి అనిల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా ఇందిరమ్మ రాజ్యం ?

- నిర్బంధం చేయడమేనా ప్రజాపాలనా ?
- ఏనుగుల రాకేష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

**హన్మకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో నిరుద్యోగ యువత నిరసనల నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వారినే అణచివేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.ప్రజల ముందుకు వెళ్లి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం ప్రజాపాలనకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రభుత్వం తన అసలు వైఖరిని బయటపెట్టిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా నిరుద్యోగ యువతను వాడుకొని వదిలేసినట్లుగా పరిస్థితి మారిందని విమర్శించారు.

దిల్‌షుక్‌నగర్‌లో తమ హక్కుల కోసం నిరసనకు దిగిన నిరుద్యోగ యువతను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్యంలో తమ సమస్యలను వెల్లడించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కును అణచివేయడం అన్యాయమని అన్నారు.

ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం వంటి హామీలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన నిరుద్యోగ యువతను తక్షణమే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీ వేదికగా ప్రకటన చేయాలని కోరారు.

**అసెంబ్లీ సాక్షిగా వాస్తవాలు బయటపడ్డాయి**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఉద్యోగాల భర్తీ అంశంపై రాజకీయ వాగ్వాదం మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు.

ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాల గణాంకాలపై ఆయన సందేహాలు వ్యక్తం చేస్తూ, అసెంబ్లీ సాక్షిగా వాస్తవాలు బయటపడినట్లు పేర్కొన్నారు. ఇన్ని రోజులు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రచారం చేసిన ప్రభుత్వం చివరకు 16,978 ఉద్యోగాలే ఇచ్చినట్లు స్పష్టత ఇవ్వాల్సి రావడం ప్రజలను తప్పుదోవ పట్టించినట్లేనని ఆయన విమర్శించారు. "నీళ్లలో నూనెను దాచలేనట్లే నిజం బయటపడిందే" అని వ్యాఖ్యానించారు.

ప్రజల ముందుకు వచ్చి భారీ సంఖ్యలో ఉద్యోగాల హామీలు ఇచ్చి, ఆ తర్వాత వాస్తవాలు భిన్నంగా ఉండడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ వేదికగా ఈ అంశాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన బీఆర్ఎస్ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మాజీ మంత్రి కేటీఆర్, అలాగే సబితా ఇంద్ర రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కె.పి. వివేకానంద్, అనిల్ జాదవ్ లు ఈ విషయాన్ని స్పష్టంగా ప్రస్తావించి వాస్తవాలను బయటపెట్టారని తెలిపారు.



ఇక ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం స్పష్టమైన, పారదర్శక విధానం ప్రకటించాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళా ..!

- ఎంపీపీఎస్ పెద్దపెండ్యాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**హనుమకొండ,మార్చి25(తెలంగాణ ముచ్చట్లు):** ఎంపీపీఎస్ పెద్ద పెండ్యాల పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందించడంలో కీలకంగా నిలిచింది. విద్యార్థులు తరగతులను నిర్వహిస్తూ, పాఠశాల పరిపాలనలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భగవాన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, నాయకత్వ గుణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఇలాంటి అనుభవాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను అద్భుతంగా నిర్వర్తించారని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో స్వయం నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయ బృందం మార్గదర్శకత్వంలో విద్యార్థులు చూపిన క్రమశిక్షణ ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,సీఆర్పి రనుప, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.






# జాతీయ ఖనిజ అన్వేషణ ట్రస్ట్ సమావేశం.. కీలక నిర్ణయాలు

- ఎన్ఎంఈటి 7వ సాధారణ సమావేశానికి అధ్యక్షత వహించిన కిషన్ రెడ్డి
- క్రిటికల్ ఖనిజాల అన్వేషణపై దృష్టి
- దేశ పరిశ్రమలు, ఇంధన రంగానికి మద్దతు లక్ష్యం




**న్యూఢిల్లీ, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ ఖనిజ అన్వేషణ మరియు అభివృద్ధి ట్రస్ట్ (ఎన్ఎంఈటి) 7వ సాధారణ సమావేశం న్యూఢిల్లీలోని ఖనిజ్ కక్ష్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అధ్యక్షత వహించారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో దేశంలో క్రిటికల్ ఖనిజాల విలువ శృంఖలాన్ని బలోపేతం చేయడంలో ఎన్ఎంఈటి పాత్రపై విస్తృతంగా చర్చించారు. దేశవ్యాప్తంగా ఖనిజ అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయడం, కొత్త ఖనిజ వనరులను గుర్తించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. భవిష్యత్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన కీలక ఖనిజాలను సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురావడం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, శక్తి మార్పిడి రంగాల్లో ఉపయోగపడే ఖనిజాల అన్వేషణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దేశంలో ఖనిజ అన్వేషణ వేగాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పరిశోధన, అన్వేషణ రంగాల్లో పెట్టుబడులను పెంచడం ద్వారా ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా దేశ పరిశ్రమల వృద్ధి, ఇంధన భద్రతకు అవసరమైన ఖనిజ వనరుల అభివృద్ధికి దిశానిర్దేశం లభించిందని అధికారులు తెలిపారు. ఎన్ఎంఈటి ద్వారా ఖనిజ రంగంలో మరింత పురోగతి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

# 'వందేమాతరం' సర్క్యులర్‌పై సుప్రీంకోర్టు స్పష్టత

- పిటిషన్ విచారణకు నిరాకరణ
- సర్క్యులర్ కేవలం సలహామాత్రమేనని వ్యాఖ్య
- తప్పనిసరి కాకపోతే జోక్యం అవసరం లేదని కోర్టు అభిప్రాయం



**న్యూఢిల్లీ, మార్చి 25 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో 'వందే మాతరం' గేయాన్ని పాడాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహాపూర్వకమైనదే తప్ప అది తప్పనిసరి కాదని స్పష్టంచేసింది. శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో ఈ దశలో జోక్యం అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను పరిశీలించింది. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ఈ బెంచ్, కేంద్రం జనవరి 28న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎక్కడా శిక్షలు లేదా బలవంతపు నిబంధనలు లేవని పేర్కొంది. అందువల్ల దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని అభిప్రాయపడింది.

ఒకవేళ భవిష్యత్తులో ఈ సర్క్యులర్‌ను తప్పనిసరి చేసి, పాటించనివారిపై చర్యలు తీసుకుంటే అప్పుడు కోర్టు జోక్యం చేసుకునే అవకాశముందని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, ఈ సర్క్యులర్ పరోక్ష ఒత్తిడికి దారితీసే ప్రమాదం ఉందని వాదించారు. 'వందేమాతరం' పాడకపోతే లేదా గౌరవ సూచకంగా నిలబడకపోతే సామాజిక వివక్ష ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశభక్తిని బలవంతంగా రుద్దలేమని, వ్యక్తిగత స్వేచ్ఛను రాజ్యాంగం కాపాడాలని ఆయన పేర్కొన్నారు.

అయితే ఈ వాదనలను కోర్టు ఊహాజనితంగా భావించింది. ఎవరిపైనైనా శిక్షార్హ చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను తిరస్కరించింది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌లో విద్యాసంస్థలు, బహిరంగ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గేయాన్ని ఆలపించాలని సూచించినప్పటికీ, అది కేవలం గౌరవాన్ని పెంపొందించడానికే ఉద్దేశించినదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిన ఈ గేయానికి ప్రత్యేక స్థానం ఉందని ప్రభుత్వం పేర్కొంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in